

హోంగార్డుల సేవలకు సలాం..

పోలీసు సిబ్బందితో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. 8లో



సమస్యకు పరిష్కారమెప్పుడు?

జిల్లా పెద్దాస్పత్రిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, రాత్రి చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఉక్కపోత వాతావరణం నమోదవుతుంది.

న్యూస్‌రీల్

'భగీరథ' నీరు సురక్షితం, ఆరోగ్యం



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ సదాశివకుమార్, అధికారులు

రఘునాథపాలెం: ఇంటింటికీ మిషన్ భగీరథ గ్రిడ్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు సురక్షితమైనదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సదాశివకుమార్ వెల్లడించారు. రఘునాథపాలెం మండల కేంద్రంలో గురువారం ఆయన మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును పరిశీలించారు. వాటర్ ట్యాంక్ వద్ద స్థానికులతో మాట్లాడిన ఆయన ఇంటింటికీ శుద్ధి చేసిన నీటినే సేవించడం ద్వారా అనారోగ్యం దరిచేరదని చెప్పారు. అలాగే, నీరు అందిస్తున్నందున వృథా కాకుండా వాడుకోవాలని సూచించారు. ఎక్కడైనా లీకేజీలు ఉంటే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.శ్రీనివాసరావు, గ్రామకార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని వేపకుంట్లలో మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ స్థానికులకు అవగాహన కల్పించారు.

10వేల మందికి రూ.32.22కోట్లు

- ధాన్యం రైతులకు బోనస్ జమ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 10,100మంది రైతులు 6,44,595.6 క్వింటాళ్ల ధాన్యం విక్రయించారని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. వీరి ఖాతాల్లో రూ.32,22,97,800 బోనస్ జమ అయిందని వెల్లడించారు. కాగా, మొత్తంగా 338 కేంద్రాల్లో అన్ని రకాలు కలిపి 1,03,670.690 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేశామని తెలిపారు.

సైన్స్‌ఫేర్‌కు 464 ఎగ్జిబిట్లు

ఖమ్మం సహకారనగర్: జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కాగా, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సైన్స్‌ఫేర్‌కు 464 ఎగ్జిబిట్లు నమోదయ్యాయని వెల్లడించారు. అంతేకాకుండా 119 ఇన్‌స్పైర్ నమూనాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు గైడ్ టీచర్లతో 9వ తేదీన ఉదయం 9గంటల్లోగా వేదికకు చేరుకోవాలని సూచించారు.

పాఠశాల విద్య మరింత బలోపేతం



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: తొలిసారిగా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను భర్తీ చేసిన నేపథ్యాన పాఠశాల విద్య మరింత బలోపేతం కానుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. ఇటీవల డీఎస్సీ ద్వారా నియమితులైన స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు ఖమ్మం నయాబజార్ పాఠశాలలోగురువారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో డీఈఓ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక విద్యాప్రణాళికను అమలు చేయడం ద్వారా వారిని ఉన్నత స్థితికి తీసుకురావొచ్చని తెలిపారు. ఎస్‌జీటీలకుస్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించడం, ఇటీవల డీఎస్సీ ద్వారా కొత్త వారిని నియమించడంతో మెరుగైన ఫలితాలు రానున్నాయని వెల్లడించారు. ఈసమావేశంలో కార్యక్రమంలో సీఎంఓ వై.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఈడీ నవీన్‌బాబు

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.నవీన్‌బాబు గురువారం పరిశీలించారు. ప్రతిరోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా కూరగాయలతో భోజనం సమకూర్చాలని నిర్వాహకులు సూచించారు. సామగ్రి కూడా నాణ్యమైనవి ఉపయోగించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎం.నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే అభివృద్ధి, ఉపాధి

మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్‌లు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- బుగ్గపాడులో ఫుడ్‌పార్క్ ప్రారంభం
- పాల్గొన్న మంత్రి తుమ్మల, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఎమ్మెల్యే రాగమయి
- ఎనిమిది కంపెనీలకు స్థల కేటాయింపు పత్రాలు



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వేదికపై మంత్రి తుమ్మల, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుచేసి మహిళలను పారిశ్రామికంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దిద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్క్‌తో పాటు అందులో కోల్డ్‌స్టోరేజ్, వేర్‌హౌస్, ప్యాక్‌హౌస్, డ్రైఫ్రూట్స్, వెజిటబుల్స్ ప్రాసెసింగ్ యూనిట్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ టి.నిర్మల జగ్గారెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అలాగే, ఎనిమిది మంది పారిశ్రామికవేత్తలకు ఫుడ్‌పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు భూమి కేటాయింపు పత్రాలు అందజేశారు.

శిక్షణ కూడా ఇప్పిస్తాం...

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏడాది పాలన విజయోత్సవ కార్యక్రమాల్లో ఉన్నందున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నూతన రెవెన్యూ విధానం రూపకల్పనలో పాలుపంచుకుంటున్నందున మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇక్కడకు రాలేకపోయారని చెప్పారు. మహిళలు చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తే హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఉమ్మడి ఏపీ ముఖ్య మంత్రి వైఎస్సార్ బుగ్గపాడులో ఫుడ్‌పార్క్‌కు శంకుస్థాపన చేస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కాగా, జిల్లాలో గ్రానైట్, జిన్నింగ్, రైస్‌మిల్లులు తదితర పరిశ్రమలు 2,300కు పైగా ఉన్నందున మరింత చెందేలా అభివృద్ధి ఐటీ, పరిశ్రమల స్థాపనకు నిరుద్యోగ యువత ముందుకు రావాలని సూచించారు. అలాగే, మహిళలతో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు.



పారిశ్రామికవేత్తలకు భూకేటాయింపు పత్రాలు అందజేస్తున్న మంత్రులు

థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయండి

సత్తుపల్లి సింగరేణిలో నాణ్యమైన బొగ్గు అందుబాటులో ఉన్నందున ఇక్కడ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మంత్రులను కోరారు. అంతేకాక బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మెగాఫుడ్ పార్కు ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గం ఎమ్మెల్యేగా తాను గెలవడం గర్వంగా ఉందన్నారు. ఇంకా ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళల సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, టీజీఐఐసీ ఈడీ ఏ.పవన్‌కుమార్, సీఈ వినోద్‌కుమార్, జెడ్ఎం మహేశ్వర్, పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అదనపు ఆదాయం

జిల్లాలో ఆయిల్‌పామ్, బొప్పాయి, జామ, కోకో, కొబ్బరి పంటలు పండుతున్నందున ఇవి పాడవకుండా రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చేలా ఫుడ్‌పార్క్ ఉపయోగపడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు నష్టపోవద్దనే భావనతో ప్రభుత్వం ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయించిందన్నారు. వైఎస్సార్ శంకుస్థాపన చేసిన ఈ ఫుడ్‌పార్క్‌ను నాబార్డు ద్వారా సుమారు రూ.100 కోట్లకుపైగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశామని చెప్పారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఫుడ్‌పార్కు పరిధిలో లక్ష ఎకరాల వరకు భూమి ఉన్నందున ఫుడ్‌పార్క్‌లోని పరిశ్రమల ద్వారా ఇక్కడ పండించే పంటలు ప్రాసెస్ చేయొచ్చని తెలిపారు. జిలాల్లో అదనంగా 6వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్, 2వేల ఎకరాల్లో పండ్లు, కూరగాయల పంటల సాగుకు కృషి చేస్తున్నామన్నారు. టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీ అమలు చేస్తోందని తెలిపారు.

పార్క్‌లో వెదురుతో నిర్మించనున్న కాటేజీల నమూనా



పాలేరు పర్యాటకానికి పూర్వ వైభవం

- రిజర్వాయర్‌లో త్వరలోనే బోటింగ్
- పర్యాటకులు సేద తీరేలా పార్క్‌ల అభివృద్ధి, కాటేజీల నిర్మాణం
- రూ.5కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు

కూసుమంచి: దశాబ్ద కాలంగా నిర్వహణ, నిధులు లేక కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ సమీపాన పార్కులు కళావిహీనంగా మారాయి. అలాగే, రిజర్వాయర్‌లో బోటింగ్ కూడా నిలిచిపోవడంతో పాలేరుకు పర్యాటకులు దూరమయ్యారు. ఈ కారణంగా స్థానికులు సైతం జీవనోపాధి కోల్పోయారు. ఈ తరుణాన రాష్ట్ర మంత్రి, పాలేరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పాలేరు పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించారు. ఈక్రమంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ద్వారా పాలేరులో పార్క్‌ల అభివృద్ధి, ఇతర పనులకు ఇటీవల రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో మళ్లీ పర్యాటకులు పాలేరు బాట పట్టేలా పనులు చేపట్టనున్నారు.

కొంగొత్తగా పార్కులు

పాలేరు పర్యాటకానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిన నేపథ్యాన పార్క్‌లు కొత్త అందాలు సంతరించుకోనున్నాయి. ప్రస్తుతం పార్క్‌లను అభివృద్ధి చేయడమే కాక గ్రీనరీ పెంచడంతో పాటు పర్యాటకుల విశ్రాంతి నిమిత్తం వెదురుతో కాటేజీలు, రెస్టారెంట్లు నిర్మిస్తారు. అలాగే, ఫౌంటెన్లు, లైటింగ్ ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే అభివృద్ధి పనులపై డీపీఆర్ రూపకల్పన బాధ్యతలను ఓ కన్సల్టెన్సీకి అప్పగించగా త్వరలోనే నివేదిక అందించనున్నారు.

ఆహ్లాదంగా బోటింగ్

రిజర్వాయర్‌లో పర్యాటకులు తిరిగేలా 60 సీట్ల లాంచీని అందుబాటులోకి తీసుకురానున్నారు. పుట్టినరోజు, ఇతర వేడుకలు జరుపుకునేలా దీన్ని కేటాయిస్తారు. అంతేకాక స్పీడ్ బోట్లు, పెడల్ బోట్లను కూడా ఏర్పాటుచేయనున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే పాలేరు పర్యాటకంగా అభివృద్ధి చెందడమే కాక స్థానికులు పలువురికి జీవనోపాధి లభిస్తుంది.



రిజర్వాయర్‌లో అందుబాటులోకి రానున్న లాంచీ నమూనా

త్వరలోనే అభివృద్ధి పనులు

పాలేరు రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. ఇక్కడ చేయాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. త్వరలోనే నిధులు విడుదల కానుండగా పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకుంటుంది.

– సుమన్ చక్రవర్తి, జిల్లా పర్యాటకశాఖ అధికారి

ఉపాధి లభిస్తుంది..

మేము కొన్నేళ్ల క్రితం పాలేరు రిజర్వాయర్‌లో బోట్లు నడిపాం. రానురాను పర్యాటకులు రాకపోవడంతో మాకు ఉపాధి లేకుండా పోయింది. ఇప్పుడు పార్క్‌లు అభివృద్ధి చేసి బోటింగ్ ప్రారంభిస్తే మళ్లీ మాకు మునుపటి మాదిరిగానే ఉపాధి లభిస్తుంది.

– బత్తుల ఉప్పయ్య, బోట్ రైడర్, పాలేరు

హామీలు అమలుచేయకుండా విజయోత్సవాలా?

మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం)/కల్లూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజాపాలన పేరుతో విజయోత్సవాలు నిర్వహిస్తుండడం గర్హనీయమని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఖమ్మంలో గురువారం బీజేపీ ఆధ్వర్యాన నిర్వహించిన బైక్ ర్యాలీని పెవిలియన్ మైదానం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆతర్వాత ఖమ్మం, కల్లూరులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఒక్క ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేయకపోగా రుణమాఫీ కూడా అసంపూర్తిగానే అమలుచేశారని విమర్శించారు. ఇక రైతు భరోసా అమలులో జాప్యంతో రైతులు పెట్టుబడి నగదు లేక అవస్థ పడుతున్నారని తెలిపారు. వీటికి తోడు మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం తదితర హామీలు నెరవేరలేదన్నారు. ఇక గతంలో 58, 59జీఓల ద్వారా ప్రభుత్వ స్థలాలు కొల్లగొట్టిన వారే కాక డీసీసీబీలో రూ.కోట్ల మోసాలకు పాల్పడిన వారిని వెంట పెట్టుకుని తిరగడం చూస్తుంటే బీఆర్ఎస్ – కాంగ్రెస్ తీరు అర్థమవుతోందని చెప్పారు. కాగా, ప్రధాని మోదీని విమర్శించడం మానుకుని ఇకనైనా హామీల అమలుపై శ్రద్ధ వహించాలని సుధాకర్‌రెడ్డి సూచించారు. ఈ సమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, నాయకులు దొంగల సత్యనారాయణ, పుల్లారావు, అల్లిక అంజయ్య, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, శీలం పాపారావు, శ్యాంరాథోడ్, రుద్ర ప్రదీప్, నంబూరి రామలింగేశ్వరరావు, వీరంరాజు తదితరులు పాల్గొన్నారు.



మోటారు బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

యంత్ర తంత్రం !

- జిల్లాలో కొత్తగా రెండు ఐటీఐలు
- ప్రస్తుతం ఖమ్మంలో మాత్రమే ఐటీఐ
- ఇటీవలే మధిరకు మంజూరు..
- పాలేరులోనూ ఏర్పాటుకు సన్నాహాలు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తక్షణ ఉపాధి లభించే అవకాశమున్న ఐటీఐల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ఐటీఐలను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు)గా అప్‌గ్రేడ్ చేసింది. ఈ జాబితాలో ఖమ్మం ఐటీఐకి కూడా స్థానం దక్కగా.. అవసరమైన చోట కొత్త ఐటీఐలను మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా మధిర నియోజకవర్గానికి మంజూరు చేసింది. అంతేకాకుండా పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెంలో సైతం ఇంకో ఐటీఐ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.



ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐ

సాంకేతిక విద్యపై ఆసక్తి

విద్యార్థులు ఎస్సెస్సీ తర్వాత తక్షణ ఉపాధి లభించే అవకాశమున్న ఐటీఐలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఇప్పటికే ఉన్న కళాశాలల్లో సీట్లు దాదాపు భర్తీ అవుతున్నాయి. ఈమేరకు ఐటీఐల సంఖ్య పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఖమ్మంలో ఉన్న ఐటీఐకి తోడు మధిరకు ఇంకొకటి మంజూరు చేయగా తిరుమలాయపాలెంలోనూ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈవిషయమై ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉండగా త్వరలోనే మంజూరు ప్రకటన వెలువడే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ఖమ్మంలోనే ఏకైక ఐటీఐ

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 1995లో ఖమ్మంలోని టేకులపల్లిలో ఐటీఐ ఏర్పాటుచేశారు. ఆ తర్వాత కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలంలో ఐటీఐలను నాటి ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. 2016లో ఖమ్మం జిల్లా రెండుగా విడిపోగా... కొత్తగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి మూడు ఐటీఐలు వెళ్లాయి. మరోపక్క ఖమ్మంలో మాత్రం ఒకటే మిగిలింది. ఈ కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెరుగుతుండడం, తాజాగా ఏటీసీగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యాన ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు అవసరమయ్యే వృత్తి విద్యాకోర్సుల బోధన కోసం కొత్త ఐటీఐ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఈక్రమాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరకు ఐటీఐని మంజూరు చేశారు. అలాగే, పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెంలోనూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఐటీఐ ఏర్పాటుపై దృష్టి సారించారు.

పీఠం ఎవరికో..?

- రామాలయ ట్రస్ట్‌బోర్డ్‌లో చోటు కోసం పలువురి తహతహ
- వెల్లువెత్తుతున్న దరఖాస్తులు
- ఏ నోట విన్నా పాలకమండలి మాటే
- ప్రజాప్రతినిధులు, మంత్రుల చుట్టూ ఆశావహుల చక్కర్లు




భద్రాచలం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ట్రస్టీబోర్డులో చోటు దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఏ నోట విన్నా పాలక మండలి మాటే వినిపిస్తోంది. ట్రస్టీబోర్డ్ చైర్మన్/ సభ్యుల కోసం ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 10 వరకు దరఖాస్తులకు గడువు విధించింది. అయితే నోటిఫికేషన్ వెలువడిన రెండు, మూడు రోజుల్లోనే పదుల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. అంతేకాదు.. తమకే అవకాశం కల్పించాలంటూ పైరవీలు కూడా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ పలువురు తిరుగుతుండడంతో ఎవరికి అవకాశం కల్పించాలో అర్థం కాక వారు తల పట్టుకుంటున్నారు.

నలుగురు కలిస్తే అదే చర్చ..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు దాటినా ఇంతవరకూ రామాలయ పాలక మండలిని నియమించలేదు. ఇప్పుడు స్వరాష్ట్రంలో మొదటి ట్రస్టీబోర్డ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతుండడంతో ఎవరికి వారు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఇందులో పార్టీ నాయకులు, ఆధ్యాత్మిక వేత్తలు, వివిధ వర్గాల వారు, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు పోటీ పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఎక్కడ నలుగురు కలిసినా ట్రస్టీబోర్డుపైనే చర్చ జరుగుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు సైతం పీఠం వైపు చూస్తున్నారు. దరఖాస్తులకు సమర్పణకు ఈనెల 10 చివరి తేదీ అయినా.. మరో రెండు, మూడు రోజుల వరకు అవకాశం కల్పిస్తారనే ఊహాగానాల నేపథ్యంలో మరి కొంతమంది దరఖాస్తు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రధానంగా పోలీసుల నుంచి అవసరమైన క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం మీ సేవ, పోలీస్ స్టేషన్‌లలో హడావుడి కనిపిస్తోంది.

భద్రాచలం రామాలయ వ్యూ



పదుల సంఖ్యలో దరఖాస్తులు..

రామాలయ ట్రస్టీబోర్డ్‌లో చైర్మన్‌తో పాటు 14 మంది సభ్యులను నియమించే అవకాశం ఉంది. ఇందులో ఒకరిద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులు పోగా మరో 12, 13 మందికి స్థానం దక్కవచ్చు. కాగా, ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 30 మందికి పైగా దరఖాస్తులు సమర్పించారని తెలుస్తోంది. ఇంకా అనేక మంది సమర్పణకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో సీపీఎం నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ నాయకుడు, గతంలో బీఆర్ఎస్‌లో ఉండి ప్రస్తుతం కాంగ్రెస్‌లో పని చేస్తున్న ఓ యువ నాయకుడు తన భార్య పేరిట, కాంగ్రెస్‌కు చెందిన ఓ వస్త్ర వ్యాపారి, వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సిఫారసుతో మెడికల్ రంగానికి చెందిన ఓ యువనేత, రోటరీ విభాగంలో సేవలందించిన మరో ముగ్గురు ఉన్నారు. వీరే కాకుండా టీడీపీకి చెందిన ఓ నాయకుడు, విద్యాసంస్థలకు చెందిన ప్రముఖుడితో పాటు వివిధ పార్టీల నేతలు, వ్యాపార రంగ ప్రముఖులు కూడా ఉన్నారని సమాచారం. వీరితో పాటుగా మరికొందరు కూడా ధ్రువీకరణ పత్రాల కోసం పరుగులు తీస్తున్నారు. మొత్తంగా చైర్మన్, సభ్యులుగా స్థానం పొందాలని ఆశించే వారి సంఖ్య హాఫ్ సెంచరీకి చేరే అవకాశం ఉంది.

మంత్రులు, ఎమ్మెల్యేలకు తప్పని తలపోటు

దేవస్థానం ట్రస్టీబోర్డ్ చైర్మన్, మెంబర్‌గా స్థానం పొందాలంటే సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులు అవసరం. దీంతో సీఎంతో సిఫారసు కోసం ఆశావహులు తమతమ మార్గాల్లో పైరవీలకు ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వద్దకు పలువురు క్యూ కట్టినట్లు సమాచారం. ట్రస్టీబోర్డ్ నియామకంలో ఈ ముగ్గురు కీలకం కానున్నారు. మరి కొందరు ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో రాజధాని బాట పట్టారు. ప్రధానంగా భద్రాచలం ఎమ్మెల్యేకు ఈ వ్యవహారం తలపోటుగా మారింది. సిఫారసు కోసం వచ్చిన వారిని నొప్పించలేక వచ్చిన ప్రతి ఒక్కరికీ లేఖలు అందించాల్సి వస్తోంది. దీంతో ఎమ్మెల్యే మద్దతు ఎవరికి ఉందో కూడా అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంది. భద్రాచలం ఎమ్మెల్యే కోటాలో ఇద్దరు సభ్యులకు అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రధాన అనుచరుల ఆశీస్సులు ఎంత మందికి దక్కుతాయోననేది చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఏజెన్సీ చట్టాలు అమలవుతున్న నేపథ్యంలో దేవస్థానం ట్రస్టీబోర్డులో సైతం గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి ర్యాంకింగ్ టీ.టీ. టోర్నీకి ఎంపిక



కేరళ స్పీకర్‌తో జిల్లా క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జరుగుతున్న జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీలో ఖమ్మం క్రీడాకారులు పాల్గొంటున్నారు. జిల్లాకు చెందిన పరాటాల జ్వలిత్, చార్విక్, ఎస్.కే.ఫైజల్, సాయిశివాని, వంశిక, ఎం.డీ.అనాస్, జి.సిరి, కె.హతేష్ తెలంగాణ జట్టు నుంచి ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కేరళ రాష్ట్రం స్పీకర్ ఏ.ఎన్.షమీర్ అభినందించారు. కాగా, జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంపై డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టీ.టీ. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీ.వీ.సాంబమూర్తి, గౌరవ అధ్యక్షుడు కూరపాటి ప్రదీప్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

రేపు అండర్–14 క్రికెట్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: అండర్–14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికకు ఈనెల 7వ తేదీన పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చేకూరి వెంకట్, కోఆర్డినేటర్ ఎం.డీ.మసూద్ తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారితో జట్టును ఎంపిక చేసి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించే నాకౌట్ టోర్నీకి పంపిస్తామని వెల్లడించారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని, వివరాలకు 98486 62125 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డిప్లొమా సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న డిప్లొమా సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ రెండేళ్ల కోర్సుకు సంబంధించి 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే ఈనెల 31వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు.

‘హరీశ్‌రావును ఎదుర్కొనే ధైర్యం లేకే అరెస్టు’

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి హరీశ్‌రావును ఎదుర్కొనే ధైర్యం లేకపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయించిందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. ఈనెల 9నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలవుతుండగా రైతు రుణమాఫీ, రైతుబంధుపై ప్రశ్నిస్తారనే భయంతో అరెస్ట్ చేయించారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడం మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు.

చేపల కుంటలను సందర్శించిన శాస్త్రవేత్తలు



చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలోని చేపల కుంటలను కేంద్ర మృత్స్య పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్‌రాథోడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేపపిల్లల ఎంపిక, మేత తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ చేపల పెంపకం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. అనంతరం సభ్యులకు సబ్సిడీపై వలలు, ఐస్ బాక్స్‌లు అందజేశారు. సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ అజిత్‌కేసరి చౌదరి, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దపాక రామదాసు, పెద్దపాక వెంకటేశ్వర్లుతో పాటు పెద్దపాక వెంకటేశ్వర్లు, కంచర్ల వెంకటేశ్వర్లు, పెద్దపాక ముత్తయ్య, పి.మైసులు, పి.రాములు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
మిర్చి	15,600	6,000
మిర్చి తాలు	7,500	7,400
ఏసీ మిర్చి	16,200	6,700
ఏసీ తాలు	8,000	6,000
పత్తి	7,100	6,000
పెసలు	6,850	6,850

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.20,413

హోంగార్డుల సేవలకు సలాం..

- పోలీసు సిబ్బందితో సమానంగా విధులు
- ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగ భద్రత లేక ఆవేదన
- జిల్లాలో 595 మంది హోంగార్డ్ ఆఫీసర్ల విధులు

నేడు హోంగార్డ్ రైజింగ్ డే



పరేడ్ ప్రాక్టీస్ చేస్తున్న హోంగార్డు ఆఫీసర్లు

ఖమ్మంక్రైం: పోలీసు శాఖలో ఉద్యోగులకు చేదోడు వాదోడుగా ఉండే హోంగార్డులు వారితో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. బందోబస్తు విధులు, ఆందోళనలు జరిగినప్పుడు అడ్డుకోవడంలో వీరు పోలీసు సిబ్బందితో సమానంగా కీలకంగా వ్యవహరిస్తుండడంతో సేవలను గుర్తించిన ఉన్నతాధికారులు హోంగార్డు ఆఫీసర్లుగా గుర్తించాలని ఆదేశించారు. అయితే, హోంగార్డ్ నుంచి హోంగార్డ్ ఆఫీసర్‌గా పేరు మారినప్పటికీ ఇతర సమస్యలు పరిష్కారం కాకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఏళ్ల తరబడి నిరాశే మిగులుతోంది. ఈనేపథ్యాన నేడు(గురువారం) హోంగార్డ్ రైజింగ్ డే సందర్భంగా కథనం.

1963లో ఏర్పాటు

సైన్యం పోరాటం చేయాల్సిన ప్రాంతాలకు వెళ్లినప్పుడు స్థానికంగా ప్రజలు, గృహాల రక్షణ, గృహ రక్షణ కోసం స్వచ్ఛందంగా హోంగార్డులు సేవలందించేవారు. ఈమేరకు 1850లోనే హోంగార్డు పదం వాడుకలోకి వచ్చింది. ఆతర్వాత భారతప్రభుత్వం ఈ వ్యవస్థను అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటుచేయాలని ఆదేశించింది. అలా 1963లో పోలీసులకు సహాయకులుగా వ్యవహరించేలా హోంగార్డు వ్యవస్థను తీసుకురాగా.. ఇప్పటికి 61ఏళ్లు నిండింది. కాగా, జిల్లాలో 595మంది హోంగార్డులు విధులు నిర్వరిస్తుండగా ఇందులో 66మంది మహిళలు ఉన్నారు.

ఉద్యోగ భద్రత లేక...

హోంగార్డులకు కనీస సౌకర్యాలు కల్పించకున్నా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, గజగజ వణికే చలిలోనూ పోలీసులకు దీటుగా సేవలు అందిస్తున్నారు. ఎన్నికల బందోబస్తుకు ఇతర రాష్ట్రాలకు వెళ్లి రావాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వ పరంగా సహకారం లేకపోవడంతో హోంగార్డులు విధి నిర్వహణలో భాగంగా ఒత్తిళ్లకు సైతం గురై అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ మేరకు తమను మినీ పోలీసులుగా గుర్తించి.. పోలీసు సిబ్బంది మాదిరి అలవెన్స్ వర్తింపచేయాలని ఏళ్లుగా కోరుతున్నారు. తద్వారా ఉద్యోగ భద్రత లభిస్తుందని, కుటుంబాలకు భరోసా ఉంటుందని కోరుతుండగా ఇప్పటివరకు మోక్షం లభించలేదు.

కారుణ్య నియామకాలు వర్తింపచేస్తే..



హోంగార్డులకు సైతం కారుణ్య నియామకాలను అమలుచేయాలి. ప్రతీ సంవత్సరం యూనిఫామ్స్ అలవెన్స్ చెల్లించాలని కోరుతున్నాం. ప్రభుత్వ పథకాలతో పాటు ఆరోగ్య బీమా అమలుచేసి అన్నిరకాల అలవెన్స్‌లు మాకు కూడా వర్తింపచేయాలి.

– వెంకటేశ్వర్లు, హోంగార్డు కమాండర్

ఆరోగ్యభద్రత కల్పించాలి..



పోలీస్ సిబ్బందికి ఆరోగ్య భద్రత ఎలా ఉందో హోంగార్డ్‌లకు కూడా కల్పించాలి. చాలామంది హోంగార్డు ఆఫీసర్లు ఆరోగ్యభద్రత లేక అనారోగ్యానికి గురైనప్పుడు సరైన చికిత్స చేయించుకోలేకపోతున్నారు. అందుకే ఆరోగ్య భద్రత కల్పించాలని కోరుతున్నాం.

– సుధాకర్, హోంగార్డు ఆఫీసర్

సెలవులు వర్తించేలా...



ప్రభుత్వ ఉద్యోగస్తులకు మాదిరిగా సాధారణ సెలవులను హోంగార్డులకు కూడా వర్తింపచేసేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుకుంటున్నాం. అలాగే, ఉద్యోగ భద్రత కల్పించాలి. అంతేకాక తగిన సౌకర్యాలు అమలుచేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం.

– రవి, హోంగార్డు ఆఫీసర్

రూ.10లక్షల సాయం ఇవ్వాలి..



ఉద్యోగ విరమణ పొందిన తర్వాత మృతి చెందిన హోంగార్డు ఆఫీసర్లకు రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించాలి. తద్వారా ఎలాంటి ఆసరా లేని హోంగార్డుల కుటుంబాలకు ఇది భరోసాగా ఉంటుంది. తద్వారా మమ్మల్ని ఆదుకున్నట్లవుతుంది.

– ఖాదర్, హోంగార్డు ఆఫీసర్

మహిళలకు అలవెన్స్..



పోలీస్ శాఖలో మహిళా ఉద్యోగులకు అన్ని రకాల సదుపాయాలు అందిస్తున్నారో అలాగే మహిళా హోంగార్డు ఆఫీసర్లకూ కల్పించాలి. అంతేకాక అన్ని రాయితీలు వర్తింపచేయాలి. ప్రసూతి సెలవులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తే మాకు మేలు జరుగుతుంది.

– నీరజ, మహిళా హోంగార్డు

ప్రభుత్వ పథకాలు అందించాలి..



ప్రభుత్వం ద్వారా కల్యాణలక్ష్మి, తెల్లరేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ పథకం మాకు వర్తింపచేయాలి. అంతేకాక ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మాకు మేలు జరుగుతుంది. అలాగే, కారుణ్య నియమాకాలు కూడా చేపట్టాలి.

– రఫీ, హోంగార్డు ఆఫీసర్ల జిల్లా అధ్యక్షుడు

కార్మికుల సమస్యకు పరిష్కారమెప్పుడు?

- వేతనాల చెల్లింపునకు అవాంతరాలు
- పెద్దాస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లినప్పటి నుండి అడ్డంకులే..
- ప్రస్తుతం జీతాలు రాక మూడు నెలలు
- నేడు ధర్నా.. రేపు మంత్రి పర్యటనను అడ్డుకుంటామని వెల్లడి



ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. వేతనాల విషయంలో తరచూ అవాంతరాలు ఎదురవడం, వారు ఆందోళనకు దిగినప్పుడు ఒకటి, రెండు నెలల వేతనాలు చెల్లించడం.. ఆపై మళ్లీ నిలిచిపోవడం సర్వసాధారమైపోయింది. ప్రస్తుతం పెద్దాస్పత్రిలోని కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో 259 మంది కార్మికులు పనిచేస్తుండగా నిర్వహణ బాధ్యతలు ఏజెన్సీ చూస్తోంది. సెక్యూరిటీ, శానిటేషన్, పేషంట్ కేర్ బాధ్యతలు నిర్వర్తించే కార్మికులకు నెలనెలా సక్రమంగా వేతనాలు రాకపోవడంతో నిరుపేదలమైన తాము కుటుంబ పోషణకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది నుండి తరచూ సమస్యలే

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి గత ఏడాది నవంబర్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ పరిధిలోకి వెళ్లాక వేతనాలు చెల్లింపు విషయంలో ఇబ్బందులు మొదలయ్యాయి. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడు ఆస్పత్రిలో 575 పడకలను అనుమతి ఉంది. అందుకు అనుగుణంగా ఏజెన్సీకి నెలనెలా రూ.50 లక్షలు చెల్లిస్తే 259 మంది కార్మికులకు వేతనాలు అందేవి. అయితే, పెద్దాస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లాక 430 పడకలకు మాత్రమే అనుమతి లభించింది. ఈ మేరకు ఏజెన్సీ బాధ్యులకు రూ.35 లక్షలే చెల్లిస్తుండడం, గతంతో పోలిస్తే రూ.15 లక్షలు తగ్గడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడం కష్టమవుతోంది. ఈ ఏడాది కాలంలో పలుసార్లు కార్మికులు ఆందోళన చేపట్టగా ఆ సమయంలో ఒక నెల జీతం చెల్లించి సర్దిచెప్పడం ఆనవాయితీగా మారింది.

ఆందోళనకు దిగుతున్న కార్మికులు

వేతనాల చెల్లింపు విషయంలో శాశ్వత పరిష్కారం లభించక కార్మికులు ఆందోళనకు దిగుతున్నారు. ప్రస్తుతం మూడు నెలల జీతం పెండింగ్ ఉండడంతోగురువారం కూడా కార్మికులు కొద్దిసేపు విధులు బహిష్కరించారు. అలాగే, శుక్రవారం కార్మిక సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అంతేకాక శనివారం పెద్దాస్పత్రికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రానున్న నేపథ్యాన ఆయన పర్యటను అడ్డుకుంటామని సీఐటీయూ, ఇఫ్టూ నేతాలు తెలిపారు. కాగా, ఏజెన్సీకి ప్రభుత్వం నుండి రూ.1.75 కోట్లు రావాల్సి ఉండగా, తామే గత నవంబర్ నుండి ప్రతీనెల రూ.15 లక్షలు సొంతంగా కలిపి కార్మికులకు చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సమస్య హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో పరిష్కరించాల్సి ఉండగా అధికారులు చొరవ చూపడం లేదని ఆరోపిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు



ఆస్పత్రిలో కార్మికుల వేతనాల సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం. కాంట్రాక్టర్ పెండింగ్ బిల్లుల విషయంలో కోర్టుకు వెళ్లడంతో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో త్వరలో బిల్లులు అందనున్నాయి. అలాగే, 430 పడకల నుంచి 575 పడకలకు పెంచే ఫైల్ ప్రధాన కార్యాలయంలో ఉంది. అక్కడి నుంచి అనుమతి రాగానే ప్రతీనెల సరిపడా జీతాలు అందుతాయి. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

● ఆకట్టుకునేలా అలంకరణ!



సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఫుడ్‌పార్క్‌ను గురువారం ప్రారంభించగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు సహా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభావేదిక వద్ద చేసిన అలంకరణ ఆకట్టుకుంది. ఆయిల్‌పామ్ గెలులు సహా వివిధ రకాల పూలు, పండ్లను ఉపయోగించి చేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా సభకు వచ్చిన వారంతా ఆసక్తిగా పరిశీలించి సెల్ఫీలు తీసుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

‘లక్ష మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదు’



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో లక్ష మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆరోపించారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియ పూర్తయినట్లుగా ప్రకటించడం సరికాదన్నారు.ఖమ్మం డీసీసీబీ పరిధిలోనే 80 వేల మందికి పైగా రైతులు మిగిలిపోయారన్నారు. ఇక నాలుగో విడత రుణమాఫీ అయిన రైతుల వివరాలను బయటకు వెల్లడించడం లేదని చెప్పారు. సాంకేతిక సమస్యలతో రుణమాఫీకి రైతులకు ఇకనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం నుంచి గ్రామాల్లో సర్వే చేయడమే కాక ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, నాయకులు రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, చింతనిప్పు చలపతిరావు, ఎస్.కే.మీరా, బిక్కసాని గంగాధర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఖమ్మంరూరల్: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకుంటూ భవిష్యత్ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని జేఎన్‌టీయూ (హెచ్) పాలేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ సూచించారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలోని కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలను పెంచుకుంటే పోటీ ప్రపంచంలో ఉన్నత భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’తో లక్షలాది మహిళలకు లబ్ధి

ఖమ్మం డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా



డిప్యూటీ మేయర్ ఫాతిమాను సత్కరిస్తున్న ఆర్‌ఎం సరిరామ్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు పెద్దపీట వేసిందని, మహాలక్ష్మి ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా తెలిపారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌లో టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యాన గురువారం ప్రజాపాలన–ప్రజా విజ యోత్సవాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో డిప్యూటీ మేయర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మహిళకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పట్టణాలకు వచ్చి ఉపాధి పొందుతున్నారని, తద్వారా కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 4.28 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్ ఏ.సరిరామ్ మాట్లాడుతూ ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను ఆర్టీసీ కల్పిస్తుందన్నారు. ప్రతీ బస్టాండ్‌లో తాగునీరు, టాయిలెట్లు, ఫ్యాన్లు, కుర్చీలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం, మధిర డిపో మేనేజర్లు దినేష్‌కుమార్, శంకర్‌రావు, ఉద్యోగులు జీ.ఎస్. నారాయణ, బాలస్వామి, సాయిసుష్మ, రామయ్య, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల కోసం వచ్చి పేకాట

కారేపల్లి: చేపల కొనుగోలుకు చెరువుకు వద్దకు వచ్చి పేకాట ఆడుతున్న ముగ్గురిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన ధారావత్ బాషింగ్, గుంజి వెంకన్న, తమ్మిశెట్టి రాములు చెరువులో పట్టిన చేపలు కొనుగోలు చేసి ఊరూరా తిరిగి అమ్ముతుంటారు. కారేపల్లి పెద్ద చెరువులో మత్స్యకారులు చేపలు గురువారం చేపలు పడతారని వచ్చిన వారు ఆలస్యం కావడంతో పేకాట ఆడుతున్నారు. ఈ విషయమై సమాచారం అందగా వారిని అదుపులోకి తీసుకుని రూ.13,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

మూడు ఇసుక టిప్పర్లు సీజ్

ఖమ్మం అర్బన్: ఏపీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాష్ తెలిపారు. ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ వద్ద గురువారం తెల్లవారుజామున తనిఖీ చేస్తుండగా వైరా మీదుగా ఖమ్మంకు టిప్పర్లు వస్తుండగా పరిశీలించామని పేర్కొన్నారు. దీంతో ఖమ్మంకు చెందిన ఎం.హర్షవర్ధన్, తనికెళ్లకు చెందిన డి.తిరుపతిరావు, గొల్లపుడికి చెందిన బి.వెంకటేశ్వర్లు వాహనాలుగా తేలిందని, అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించడంతో వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విత్తన డీలర్‌పై కేసు నమోదు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : నకిలీ విత్తనాలు అంటగట్టిన డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ గురువారం తెలిపారు. పోలీసులు, బాధిత రైతుల కథనం ప్రకారం.. రాజాపురం గ్రామానికి చెందిన నలుగురు రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సత్తుపల్లిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 31 బస్తాల వరిధాన్యం విత్తనాలు కొనుగోలు చేసి సేద్యం చేశారు. అయితే ఎకరాకు 3 నుండి 5 బస్తాల ధాన్యం దిగుబడి తగ్గింది. అధికంగా బెరుకులు వచ్చాయి. పంటనష్టపోయిన రైతులు రశీదులతో పోలీసులను ఆశ్రయించారు. రశీదులో లాట్ నంబర్‌ను డీలర్ మార్చి ఇచ్చినట్లు పోలీసులు గుర్తించి డీలర్ సాయికృష్ణపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

బస్సును ఢీకొట్టిన ద్విచక్రవాహనం

ఇద్దరు యువకుల మృతి



శివరాజు (ఫైల్)



హర్షవర్ధన్ (ఫైల్)

ఖమ్మంరూరల్: ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తున్న ఇద్దరు యువకులు ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులో గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం జరిగింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరి మృతితో వారి కుటుంబాల్లోనే కాక గ్రామంలో విషాదం అలుముకుంది.

సూర్యాపేట వైపు వెళ్తూ...

తిరుమలాయపాలెం మండలం హైదర్‌సాయిపేట గ్రామశివారు పడమటి తండాకు చెందిన గుగులోత్ శివరాజు(19) మూడు హర్షవర్ధన్(18) ద్విచక్రవాహనంపై ఖమ్మం మీదుగా సూర్యాపేట వైపు బయలుదేరారు. అయితే, వీరు బైక్‌పై వేగంగా వెళ్లే క్రమాన ఎదురుగా వచ్చిన ఆర్‌టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో బలంగా ఢీకొట్టారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, వీరిలో హర్షవర్ధన్ తల్లిదండ్రులు ఏడాది క్రితమే అనారోగ్యంతో కన్నుమూశారు. అప్పటి నుంచి ఆయన బాబాయి వద్ద ఉంటున్నాడు. ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలాఉండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని పూజారి మృతి



కిషోర్‌శర్మ (ఫైల్)

ఖమ్మంక్రైం: కుమార్తెను చూసేందుకు బైక్‌పై వెళ్తున్న పూజారిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఖమ్మం కొత్త బస్టాండ్ వద్ద గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కొణిజర్ల మండలం అమ్మపాలెంకు చెందిన మారుతీ కిషోర్‌శర్మ(55) దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తుండగా ఆయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఓ కూతురు ఖమ్మంలో ఉండడంతో ఆమెను చూసేందుకు బైక్‌పై బయలుదేరిన ఆయన కొత్త బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొనటంతో టైర్ల కిందపడి నలిగిపోయిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న ఖమ్మం టూటౌన్ పోలీసులు ఆయన అల్లుడు వశిష్ఠకు సమాచారం ఇచ్చి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో టైర్ల కింద నుంచి మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. ఘటనపై కిషోర్‌శర్మ భార్య అనసూయ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. కాగా, కిషోర్ శర్మ కుమారుడు కూడా పౌరోహిత్యం చేస్తుండగా.. శర్మకు అమ్మపాలెంలో మంచిపేరు ఉండడంతో పెద్దసంఖ్యలో స్థానికులు మార్చురీ వద్దకు వచ్చి నివాళులర్పించారు.

రెండు మృతదేహాలకు అంత్యక్రియలు



మృతదేహాల వద్ద అన్నం ఫౌండేషన్ బాధ్యులు, పోలీసులు

ఖమ్మంవైద్యవిభాగం: ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందారు. వీరి మృతదేహాలను మార్చురీలో భద్రపరిచినా సంబంధీకులు ఎవరూ రావడంలేదు. దీంతో అన్నం ఫౌండేషన్ బాధ్యులకు ఆస్పత్రి, పోలీసు సిబ్బంది సమాచారం ఇవ్వగా గురువారం బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో దూకి దివ్యాంగుడి ఆత్మహత్య



రామారావు (ఫైల్)

నేలకొండపల్లి: దివ్యాంగుడినైన తన బాగోగులు చూసుకునే వారెవరూ లేరనే మనస్తాపంతో ఓ వ్యక్తి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని రాయగూడెంకు చెందిన దివ్యాంగుడైన రామారావు(45)కు వివాహం కాలేదు. ఇటీవల తల్లి అనారోగ్యంతో మంచం పట్టింది. దీంతో తనను చూసుకునేందుకు ఎవరూ లేరని జీవితంపై విరక్తి చెందిన ఆయన గురువారం స్థానిక వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన బంధువు ఫిర్యాదుతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కేసు నమోదు చేశారు. కాగా, రామారావు ఆత్మహత్యకు ముందుకు తనకు రావాల్సిన డబ్బు, ఇతర ఆర్థిక వ్యవహారాలను డైరీలో రాసినట్లు తెలిసింది.